# అభివృద్ధి చేసిన వారిని ఆశీర్వదించాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కలెక్టరేట్, అక్టోబర్ 25: ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ, నిబద్ధతతో అభివృద్ధి చేసిన వారినే ఎన్నికల్లో ఆశీర్వదించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ కోరారు. నగరంలోని హుస్సేనీపురలో బుధవారం ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడే ప్రభుత్వాలకు ఓటు అనే ఆయుధం ద్వారా జీవం పోసి, తమకు సేవ చేసే నాయకులను ఎన్నుకోవడంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని స్పష్టం చేశారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే అస్త్రం ద్వారా వారికి అభివృద్ధి చేసిన వారిని, ప్రజలకు అందుబాటులో ఉండేవారిని గుర్తించి ఓటు వేసి ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. ప్రజా సంక్షేమం కాంక్షిస్తూ, నిరంతరం ప్రజలతో మమేకమయ్యే వారిని ప్రజాప్రతినిధులుగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంఐఎం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, ముస్లిం బాలికల స్టూడెంట్స్ వింగ్ ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన యువతులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ, ఓటర్లుగా నమోదు చేయించడం అభినందనీయమన్నారు. యువతే భవిష్యత్ ప్రజాప్రతినిధులని, ముస్లిం మహిళలు, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అంజద్ అలీ, నాయకులు అబ్బాస్ షమీ, ఎంఐఎం మహిళా కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యురాలు రఫియా సుల్తానా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

కార్పొరేషన్, అక్టోబర్ 25: నగరంలో బీజేపీకి చెందిన పలువురు యువకులు బుధవారం సాయంత్రం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సాయివాస్, కొండమీది ప్రశాంత్, సదుర్ల ప్రేమ్, జనగామ కృష్ణ, ఆపిరెడ్డి మహేశ్, శ్రీ రాముల ప్రమేశ్, అరవింద్, సాయికృష్ణ, శివ, మణికంఠ, ధర్మ తేజ తదితరులున్నారు.



యువకుడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# తనిఖీ బృందాల వాహనాలకు జీపీఎస్

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీ గోపి
- ఎన్నికల విధులు, బాధ్యతలపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్



ఆర్‌వోతో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 25: సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల తనిఖీ బృందాల వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల తనిఖీ బృందాలు పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు, బాధ్యతలపై రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంపీడీవోలు, సీపీతో కలిసి ఆయన బుధవారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడ కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండుగలు, ఇతర కార్యక్రమాల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, గోడలపై వాల్‌రైటింగ్ చేయడం, గోడ ప్రతులు అతికించడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం లాంటి పనులు నిలిపివేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన బ్యానర్లను వెంటనే తొలిగించాలన్నారు. నియోజకవర్గాల వారీగా అనుమతిలేకుండా పోస్టర్లు అతికిస్తే, వాటిని సుమోటోగా స్వీకరించి, ఎన్నికల నియమావళి మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సర్వేలైన్ బృందాలు, చెక్‌పోస్టులతో పాటు ఏర్పాటు చేసిన బృందాల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. కేటాయించిన సిబ్బందికి అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిష్టర్లు పరిశీలించాలని, నియోజకవర్గాల పనితీరును జిల్లా కేంద్రం నుంచి కూడా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సెలవులతో సంబంధం లేకుండా 24/7 తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. రిటర్నింగ్ అధికారులు నిత్యం నివేదికలు పంపాలని, క్షేత్రస్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందిస్తూ, ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు అనుమతుల్లేకుండా ఎవరూ కూడా తమ విధులు విస్మరించి వెళ్లకూడదన్నారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన అనుమతులకు మించి వాహనాలు వాడకుండా చూడాలని, సభలు, సమావేశాల వివరాలను ఖచ్చితంగా వీడియో రికార్డు చేయించాలన్నారు. అవసరం మేరకు అదనపు సిబ్బందిని కూడా నియమిస్తామన్నారు. అనంతరం సీపీ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడారు. రాజకీయ పార్టీలు చేపట్టే ప్రచారాలు, సమావేశాలు, సభలు నిర్వహించే చోట ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది విధులకు హాజరుకాని పక్షంలో పైఅధికారులకు వెంటనే సమాచారం అందజేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కే మహేశ్వర్, రాజు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎస్ఎఫ్‌టీ, వీఎస్‌టీ బృందాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

ప్రచారం చేయడానికి తీసుకువచ్చిన వాహనం



*కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నగరంలోని కాపువాడలో ప్రచారం చేశారు. ఈ క్రమంలో ప్రచార రథం ద్వారా నియోజకవర్గంలో ప్రచారం చేశారు.* **-కార్పొరేషన్, అక్టోబర్ 25**

## గంగుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కొత్తపల్లి, అక్టోబర్ 25: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి గంగుల కమలాకర్ గెలుపునకు అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలొద్దీన్ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ నివాసంలో బుధవారం కొత్తపల్లి మున్సిపల్ బూత్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూచనల మేరకు పలు బూత్‌లకు సంబంధించిన పనులను వారికి అప్పగించారు. బూత్ ఇన్‌చార్జీలకు కేటాయించిన పనులను శనివారం సాయంత్రంలోగా ముగించాలన్నారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి గంగుల కమలాకర్ గెలుపుతోనే సాధ్యమవుతుందని, ఇది గతంలోనే రుజువైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కరీంనగర్ నియోజకవర్గం, కొత్తపల్లిలో జరిగిన అభివృద్ధి పనులను ఇంటింటికీ తిరిగి ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే అసెంబ్లీ పరిధిలో కొత్తపల్లి పట్టణంలో గంగుల కమలాకర్‌కు భారీ మెజార్టీ వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

## పద్యకవి జీవీ కృష్ణమూర్తి మృతికి సంతాపం



జీవీ కృష్ణమూర్తి (ఫైల్)

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 25: ప్రముఖ పద్యకవి, కీర్తి పురస్కార గ్రహీత జీవీ కృష్ణమూర్తి బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్ నివాళులర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, రామాయణ కుటుంబ సభ్యులు, రాజరాజేశ్వర శతకం, వెంకటేశ్వర శతకం, పద్యమందారం, దేవి శతకం, నీవు శతకం, బాల వెన్నెల వంటి శతకాలు ఆయన రాశారని గుర్తు చేశారు. అలాగే, జీవీ కృష్ణమూర్తి మృతి పట్ల జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, రామకవితల శర్మ, సాహితీ గౌతమి ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ వారాల ఆనంద్, డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, బొద్దుల లక్ష్మయ్య, సముద్రాల వేణుగోపాల ఆచార్య, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజోజ నాగభూషణం, కేఎస్ నంతాచార్య, మాడిశెట్టి గోపాల్, దబ్బెట రాజా రామ్మోహన్ శర్మ, కేబీ శర్మ తదితరులు సంతాపం తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

మల్యాల, అక్టోబర్ 25: రాబోయే శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మల్యాల మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు, ప్రజలు రావడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మునీందర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశం, ఎంపీవో వాసవి, ఆర్ఐ తిరుపతి, సెక్టోరియల్ అధికారులు జ్ఞానేశ్వర్, ఇబ్రహీం మునావర్ తదితరులున్నారు.

## 29న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కొత్తపల్లి, అక్టోబర్ 25: నగరంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఈనెల 29న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 సంవత్సరాల్లోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను వచ్చే నెల 14, 15, 16, 17 తేదీల్లో తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

## ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 25: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ 2, 4, 6వ సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.